క్లుప్తంగా

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

కడియం: మండల కేంద్రమైన కడియంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ తరగతులు జరుగుతాయని గ్రంథాలయాధికారి శెట్టిపల్లి శ్రీదేవినిర్మల తెలిపారు. జూన్ 6 వరకు తరగతులు కొనసాగుతాయన్నారు. కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలతో పాటు, పలు అంశాలపై ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాటర్ స్ప్రింకిల్డ్ మెషీన్‌తో వేసవి తాపం అదుపు


మెషీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో భాగంగా నగరంలో గాలి నాణ్యతను పెంచడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. రూ.48 లక్షల ఎన్కాప్ నిధులతో కొనుగోలు చేసిన వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మెషీన్‌ను ఆదివారం ప్రారంభించారు. దీని ద్వారా మంచి నీటిని గాలిలోకి చల్లి, కాలుష్యాన్ని తగ్గించ వచ్చని, దుమ్ము, ధూళిని నీటి బిందువులతో అణిచివేస్తుందని కమిషనర్ చెప్పారు. స్ప్రింక్లర్ల నుంచి నీరు వెదజల్లడం ద్వారా, వేడి తరంగాల సమయంలో గాలిని చల్లబరుస్తుందన్నారు. ఇది మరింత సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా నగరంలో వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మెషీన్ ద్వారా నీటి వెదజల్లే ప్రక్రియను కొనసాగించడం నగర ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

పేలిన తారు ట్యాంకర్

రాజానగరం: దివాన్‌చెరువు శివారు బీజాపురి టౌన్‌షిప్‌లో తారు ట్యాంకర్ పేలి, రెండు ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రెండు భాగాలుగా ఉన్న ట్యాంకర్‌లో ఒక భాగంలోని తారును కరిగించే క్రమంలో మంట పెట్టారు. అప్పటికే దానిలో గ్యాస్ నిండి ఉండడంతో ట్యాంకర్ పేలి, మంటలు ఎగసిపడ్డాయి. పేలుడు తీవ్రతకు సమీపంలోని రెండు ఇళ్ల శ్లాబ్‌లు బీటలు తీశాయి. విషయం తెలుసుకున్న రాజమహేంద్రవరం అగ్నిమాపక దళం హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని, ఫోమ్‌తో మంటలను అదుపు చేశారు.

సినిమాలు



శ్యామల	: జింఖానా
సూర్యమినీ	: కేసరి చాప్టర్-2
సూర్యప్యాలెస్	: జాక్
స్వామి	: ఓదెల-2
శివజ్యోతి	: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
అనుశ్రీ	: తుడరమ్
రాజా	: ఓదెల-2
ఊర్వశి	: చౌర్య పాఠం
మేనక	: సూర్యాపేట్ జంక్షన్, సోదరా
రంభ	: అంటిల్‌డాన్
కుమారి	: ఓదెల-2
అప్సర	: సారంగపాణి జాతకం
అశోక	: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
నామవరం	
వీఎస్ మహల్	: తుడరమ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: సారంగపాణి జాతకం
కడియం	
వెంకటసూర్య	: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి

ఆరోగ్యం బొగ్గుపాలు

- **సమస్యగా మారిన రైల్వే డంపింగ్ యార్డ్**
- **జనావాసాలకు దూరంగా తరలించాలంటున్న స్థానికులు**
- అనారోగ్యాల బారిన పడుతున్న వైనం
- పట్టించుకోని రైల్వే యంత్రాంగం


తూర్పు స్టేషన్ వైపు బొగ్గు డంపింగ్ యార్డ్


బొగ్గును తరలించే భారీ లారీ


పొక్లెయిన్‌తో బొగ్గును ఎత్తుతుండగా వెలువడుతున్న కాలుష్యం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్ తూర్పు ప్రాంతంలో దశాబ్దాల తరబడి నిర్వహిస్తున్న బొగ్గు డంపింగ్ యార్డ్ వల్ల తాము ఇబ్బందులకు గురవుతున్నామని పరిసర ప్రాంతాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తరలించేందుకు రైల్వే శాఖ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు రైళ్లలో తరలించే బొగ్గును స్థానిక పేపరు మిల్లు అవసరాలకు వినియోగిస్తారు. పేపర్ మిల్లు వరకు రైల్వే లైన్ లేకపోవడంతో రైల్వే శాఖ ఐదు దశాబ్దాల క్రితం స్థానికంగా రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ షెడ్ వద్ద బొగ్గు డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేసింది. అక్కడి నుంచే లారీల ద్వారా బొగ్గును పేపరు మిల్లుకు తరలించేవారు. ప్రయాణికుల రద్దీ, అవసరాల దృష్ట్యా సుమారు రెండు దశాబ్దాల క్రితం తూర్పు వైపు రైల్వే స్టేషన్ ఏర్పాటైంది. అదే సమయంలో బొగ్గు డంపింగ్ యార్డ్‌ను తూర్పు రైల్వే స్టేషన్ వైపు మార్పు చేశారు. భారీ వాహనాల రాకపోకలకు అనువుగా రోడ్లను కూడా నిర్మించారు. బొగ్గు కాలుష్యం పెరిగిపోయిందంటూ అప్పట్లోనే పరిసర ప్రాంతాల్లో ఉన్న జనావాసాల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. అంతేకాకుండా భారీ వాహనాల రాకపోకలతో.. పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని, ప్రాణనష్టం కూడా జరిగింది. రైల్వే శాఖ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో, కాలక్రమంలో స్థానికులు కూడా పట్టించుకోకపోవడంతో సమస్య మరుగున పడిపోయింది. ఇలాఉండగా నగరం విస్తరిస్తుండడం, పెరిగిన జనాభాతో డంపింగ్ యార్డ్ చుట్టూ జనావాసాలు గణనీయంగా పెరిగాయి. డంపింగ్ యార్డ్ నుంచి వెలవడే దుమ్ము-ధూళితో కూడిన బొగ్గు కాలుష్యం నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందల కొద్దీ టన్నుల బొగ్గు రైళ్ల నుంచి దిగిమతి అయ్యాక, ఈ సరకును పొక్లెయిన్లతో భారీ లారీల్లో నింపి తరలిస్తున్నారు. ఈ బొగ్గును తరలించే సమయంలో వెలువడే కాలుష్యం వలన దుమ్ము-ధూళి నిత్యం ఇళ్లలో చేరి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తలెత్తుతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాల్లో కలిసి వస్తున్న దుమ్ము-ధూళి తాగునీటిపై పొరగా ఏర్పడుతోందంటున్నారు. ఆయా సమస్యల నేపథ్యంలో ఈ డంపింగ్ యార్డ్‌ను తరలించాలని ఎన్ని విజ్ఞప్తులు, నిరసనలు చేసినా.. రైల్వే శాఖాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బొగ్గు డంపింగ్ యార్డ్‌ను జనావాసాలకు దూరంగా తరలించి, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాలకు కాలుష్య రహితంగా మార్చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్యను పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడంతో, ఏం చేయాలో పాలుపోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. బొగ్గు డంపింగ్ యార్డ్‌ను తరలించాలంటూ సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌కు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా, కనీస స్పందన కరవైందంటూ స్థానికులు చెబుతున్నారు.

ఆ ప్రణాళిక ఏమైందో?

కొన్నేళ్ల క్రితం బొగ్గు డంపింగ్ యార్డ్‌ను కడియం ప్రాంతానికి తరలించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని అధికారులు ప్రకటించినట్టు చెబుతున్నారు. ఇప్పటివరకు దీనిపై ఆ దిశలో ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తుందంటూ స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు డంపింగ్ యార్డ్ చుట్టూ పెరిగిన జనావాసాలను దృష్టిలో ఉంచుకుని, స్థానికుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డంపింగ్ యార్డ్‌తో అనారోగ్యం



బొగ్గు ఎగుమతులు, దిగుమతుల సమయంలో వెలువడే దుమ్ము-ధూళితో స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. రెండు దశాబ్దాలుగా యార్డు తరలించాలని కోరుతున్నా చర్యలు లేవు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బొగ్గు డంపింగ్ యార్డ్‌ను కడియం ప్రాంతానికి తరలించేలా చర్యలు చేపట్టాలి.

– గుడే రఘునరేష్, వ్యవస్థాపక కార్యదర్శి, వలంటీర్ సోషల్ సర్వీస్ అసోసియేషన్, రాజమహేంద్రవరం

ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి



డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే కాలుష్యంతో మహిళలు ఇళ్లల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి బిందెల్లో ఈ దుమ్ము-ధూళి పొరలా పేరుకుపోతోంది. దీనివల్ల కుటుంబంలో వృద్ధులు, చిన్నారులు అనారోగ్యాల పాలవుతున్నారు. రైల్వే అధికారులు ఇప్పటికైనా చర్యలు చేపట్టి.. జనావాసాలకు దూరంగా డంపింగ్ యార్డ్‌ను తరలించాలి. స్థానిక ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

– బి.శివజ్యోతి, అల్కాట్‌తోట

వ్యాధులపై అవగాహన ఉండాలి


పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

సీటీఆర్ఐ: వయస్సు పెరిగే కొద్దీ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ గోగినేని రత్నాకర్ అన్నారు. ఆదివారం జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వరనగర్‌లో క్లబ్ సభ్యులతో పాటు, స్థానికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఊపిరితిత్తుల పనితీరు, వాటికి సంక్రమించే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన జీవితానికి ఆరోగ్యకరమైన ఊపిరితిత్తులు అవసరమన్నారు. సభ్యులు అడిగిన సందేహాలను డాక్టర్ రత్నాకర్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతి నెలా ఉచిత పరీక్షలతో పాటు, మందులు కూడా అందిస్తున్నామన్నారు.

అగ్ని బాధితులకు ఆర్థిక సాయం

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలోని బుర్రిలంకలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన రెండు బాధిత కుటుంబాలకు పలువురు ఆర్థికసాయం అందజేశారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి రూ.10 వేలు, కూటమి నాయకులు రూ.30 వేలు మొత్తం రూ.40 వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, వైస్ ఎంపీపీ పంతం గణపతి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పహల్‌గాం ఘటనపై శాంతి ర్యాలీ



బొమ్మూరులో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మహిళలు


సౌత్ సెంట్రల్ రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో..

రాజమహేంద్రవరం రూరల్: జమ్మూ-కశ్మీర్‌లోని పహల్‌గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదుల జరిపిన దాడిని నిరసిస్తూ బొమ్మూరులో ముస్లింల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పెద్దఎత్తున కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదాన్ని అరికట్టాలి, నిందితులను కఠినంగా శిక్షించాలి, హిందూ ముస్లిం భాయ్ భాయ్, మేరా భారత్ మహాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మహిళలు మాట్లాడుతూ, అమాయక పర్యాటకులను ఉగ్రవాదులు హతమార్చారని, ప్రతి పౌరుడు ఈ దాడిని ఖండించాలన్నారు. ఉగ్రవాదుల చేతిలో అసువులు బాసిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ ర్యాలీ బొమ్మూరు సెంటర్ మీదుగా దోసాలమ్మ గుడి, కాపులవీధి మీదుగా మసీదు వద్దకు చేరుకుంది.ఈ ర్యాలీకి పలు సంఘాల నేతలు మద్దతు తెలిపారు. ఈ ర్యాలీలో ముస్లిం మహిళలు, ముస్లిం యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో..

రాజమహేంద్రవరం సౌత్ సెంట్రల్ రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పహల్‌గాంలో ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్కౌట్ డెన్ నుంచి బాలాజీపేట ఎస్‌బీఐ, ఐఎల్‌టీడీ జంక్షన్ మీదుగా రైల్వేస్టేషన్ వద్ద రైల్వే రక్షణ దళం వద్దకు చేరుకున్నారు. స్కౌట్ మాస్టర్ ఎస్‌వీ భద్రరావు, ఎస్ఆర్‌వీ బ్రహ్మేశ్వరరావు, స్కౌట్ యోగా మాస్టర్ కేఎస్‌వీ శ్రీధర్‌రెడ్డి సారథ్యంలో 60 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్, రైల్వే రక్షక దళం అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో పిల్లలు జాగ్రత్త

మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్


చలివేంద్రం ప్రారంభిస్తున్న భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ముందుంటారని మాజీ ఎంపీ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం నగరంలోని ఆరో డివిజన్ యువజన విభాగం సభ్యులు డీఎంహెచ్ స్కూలు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ, బాటసారులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసిన పార్టీ నగర యువజన విభాగం అధ్యక్షుడు బిల్డర్ చిన్నను అభినందించారు. వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున తలిదండ్రులు తమ పిల్లలను బయటకు పంపించవద్దని సూచించారు. మే నెలలో మరింత అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున పిల్లల రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాహితం కోసం వైఎస్సార్ సీపీ పనిచేస్తుందని, కోవిడ్ సమయంలోనూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల రక్షణకు, వారిని ఆదుకునేందుకు అనేక చర్యలు చేపట్టారన్నారు. భవిష్యత్తులో కూడా తమ పార్టీ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో గాండ్ల, తెలకుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియ, వివిధ విభాగాల నాయకులు వాసంశెట్టి గంగాధరరావు, మజ్జి అప్పారావు, నరవ గోపాలకృష్ణ, కడియాల శ్రీనివాస్, సప్పా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం



రాజానగరం: తూర్పుగానుగూడెంలో ఆదివారం రాత్రి రెండు తాటాకిళ్లు దగ్ధమై, సుమారు రూ.ఆరు లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో పి.ముత్యాలరావు, ఎస్.రామస్వామి కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. ప్రమాద సమయంలో ఆ ఇళ్లల్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ముత్యాలరావు కుమార్తెకు చెందిన టెన్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో పాటు, రెండిళ్లలోని నిత్యావసర వస్తువులు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది రాజమహేంద్రవరం నుంచి వచ్చినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

పూర్వ విద్యార్థుల కలయిక


వీరవరం బత్తుల సూరన్న జెడ్పీ స్కూలుకు చెందిన పూర్వ విద్యార్థులు

కడియం: మండలంలోని వీరవరం బత్తుల సూరన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా స్కూల్‌లో కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించి, మెమెంటోలను అందజేశారు. అందరినీ ఏకం చేసేందుకు కృషి చేసిన సురేష్ పంపన, ఆకుల రాజేష్, కొమ్మన దుర్గారావు, కొత్తపల్లి శివకుమార్, గంగరాజు, దుర్గాప్రసాద్, చిట్టిబాబు, సురేష్, పెద్దరాజు తదితరులను ఈ సందర్భంగా అభినందించారు.

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని బొప్పన సావిత్రమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2008-2009 పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక పేరుతో సందడి చేశారు. తరగతి గదుల్లో అప్పటి అల్లర్లను గుర్తు చేసుకుంటూ, నిక్‌నేమ్‌లతో పిలుచుకుంటూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తామని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు.


హుకుంపేటలోని బొప్పన సావిత్రమ్మ జెడ్పీ స్కూల్‌లో అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నగర వాసి నింశీకి గిన్నిస్ రికార్డు


ఆడమ్స్ నింశీ


రికార్డ్ ధ్రువపత్రాన్ని అందుకుంటున్న ఆడమ్స్ నింశీ తల్లిదండ్రులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ సాంగ ఆడమ్స్ నింశీ(26) గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి ధ్రువపత్రం అందుకున్నారు. విజయవాడలోని హలెల్ సంగీత పాఠశాలలో కీబోర్డు నేర్చుకున్న ఆడమ్స్ గతేడాది డిసెంబర్ ఒకటిన ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన సంగీత వాయిద్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ఇందులో 18 దేశాల నుంచి 1,100 మంది సంగీత కళాకారులు పాల్గొని, ఆన్‌లైన్‌లో సరళీ స్వరాలను గంట పాటు కీబోర్డుపై ఆలపించారు. ఆ వీడియోలను ఇన్‌స్టాగామ్‌లో అప్లోడ్ చేసి ఈ ఘనత సాధించినట్లు ఆడమ్స్ తెలిపారు. మొత్తం 1,100 మంది ఈ ప్రదర్శనలో పాల్గొనగా, 1,046 మంది ఈ రికార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఆడమ్స్ తండ్రి సునీల్ గతంలో రాజమండ్రి ఈపీఎఫ్ ఆఫీసులో పనిచేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం లాలాచెరువు ఎస్‌బీఐ కాలనీలో ఉంటున్నారు. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో హలెల్ సంగీత పాఠశాల వ్యవస్థాపకులు పాస్టర్ అగస్టీన్ దండిగి నుంచి ఆడమ్స్ తల్లిదండ్రులు సునీల్, రోజారాణి గిన్నిస్ ధ్రువపత్రం అందుకున్నారు. ఆడమ్స్ ఇటీవలే విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లారు. ఏఈవో సంఘ రాష్ట్ర అధ్యక్షులు డి.వేణుమాధవరావు, కాతేరు, మురమళ్ల వైఎంసీఏ అధ్యక్షులు గుళ్ల మార్టిన్ శాంతిమార్, సునీల్‌కుమార్ అభినందనలు తెలిపారు.

కోలాహలంగా ఎడ్ల పట్టు పందేలు


ఎడ్ల పట్టు పందెం దృశ్యం


విజేతలకు షీల్డ్ అందజేస్తున్న అతిథులు

రాజానగరం: చక్రద్వారబంధం గ్రామంలో ఎడ్ల పట్టు పందేలు (ఎడ్లతో ఉన్న బండికి చక్రాలు తిరగకుండా తాళ్లతో కట్టి, వాటిపై బరువుతో కూడిన ఇసుక మూటలు పెట్టి జరిపే పందేలు) ఆదివారం కోలాహలంగా నిర్వహించారు. ముంగర తాతి, గంగరాత్నం జ్ఞాపకార్థం వారి కుమారుడు రాంబాబు ఆధ్వర్యాన స్థానిక రైసు మిల్లు లేఅవుట్‌లో ఈ పందేలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి 17 జతల ఎడ్ల పాల్గొనగా, ఐదింటిని విజేతలుగా ఎంపిక చేసి, వాటి యజమానులకు షీల్డులు బహూకరించారు. మొదటి స్థానంలో మురమళ్ల రాంబాబు (మూలస్థానం), రెండో స్థానంలో పడాల రాంబాబు (బడుగువానిలంక), మూడో స్థానంలో వెలి శ్రీరామ్ (చింతల నామవరం), నాలుగో స్థానంలో ముంగర నాగేశ్వరరావు (చక్రద్వారబంధం), ఐదో స్థానంలో మిద్దే సురేష్ (మురమండ) నిలిచారు.

భారీ అన్నదానం

కడియం: మండల కేంద్రమైన కడియం గ్రామ దేవత వనువులమ్మ వారి జాతర, తీర్థం ముగింపులో భాగంగా ఆదివారం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. భక్తులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించింది.